సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



ఉన్నత చదువుకు తొలిమెట్టు
ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్ ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 24 వరకు గడువు ఉంది. -4లో



అక్రమంగా కొండను తవ్వేస్తున్నారు
కొండను చదును చేస్తున్నారని, పైగా అనుమతులు లేకుండా సోలార్ కంపెనీ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. -4లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
40.0/27.4

జిల్లాలో శనివారం 27.4 - 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు హౌసింగ్ కమిటీ సమావేశం
కడప కల్చరల్: జిల్లా ఎన్జీఓ సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని పాలక వర్గ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని శాటిలైట్ సిటీలోగల సంస్థ కార్యాలయంలో ఈ సమావేశం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇందులో జమా ఖర్చుల ఆమోదం, డ్యూయల్ మెంబర్ షిప్ గల వారి సమస్యలను అధ్యక్షుల అనుమతితో చర్చిస్తామన్నారు.

నేడు పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు
కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రైవేటు, ఎయిడెడ్, మండల పరిషత్, కేజీబీవీ, ఎంపీయంఎస్ పాఠశాలలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఈ నెల 20న నిర్వహించరాదని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్య ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ నిర్వహిస్తే ప్రధానోపాధ్యాయులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

రేపు జాబ్ మేళా
కడప కోటిరెడ్డి సర్కిల్: స్థానిక రిమ్స్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ప్రముఖ 18 కంపెనీలతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఫొటోలు తీసుకుని రావాలన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ అధికారిపై విచారణ
కడప కోటిరెడ్డి సర్కిల్: కడప ఆర్టీసీలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శనివారం విచారణ చేపట్టారు. నెల్లూరు జోన్ విజిలెన్స్ అధికారి ధర్మతేజను రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణాధికారిగా నియమించారు. ఆయన శనివారం కడపకు వచ్చి ఆర్టీసీ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్టీసీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రాయలసీమలోని 8 జిల్లాల 40 మంది పోలీసు కానిస్టేబుళ్లను విచారణ చేయనున్నట్లు సమాచారం. ఆ నివేదికను త్వరలో రాష్ట్ర ఉన్నతాధికారికి అందజేయనున్నారని తెలిసింది.

బాధ్యతలు స్వీకరణ


హిదాయతుల్లా

కడప కోటిరెడ్డి సర్కిల్: ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా షేక్ హిదాయతుల్లా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన నియమితులయ్యారు. శనివారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హిదాయతుల్లా మాట్లాడుతూ మహిళలు, యువత, విద్యార్థులు, వ్యాపారులు వంటి అన్ని మైనారిటీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న మైనారిటీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులైన వ్యక్తులకు చేరుస్తామని తెలిపారు. సంబంధీకులు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించాలని వివరించారు.

వర్షం మిగిల్చిన కన్నీళ్లు

అన్నదాతలు ఆరుగాలం శ్రమించారు.. పంటలను కన్నబిడ్డల్లా పెంచుకున్నారు.. దిగుబడి చేతికి వస్తోందని ఎంతో ఆనందించారు.. ఈ నేపథ్యంలో అకాల గాలివాన విరుచుకు పడింది. దీంతో అపార నష్టం వాటిల్లింది. ముఖ్యంగా పండ్ల తోటలు భారీగా దెబ్బతిన్నాయి. అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. వారు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- బీభత్సం సృష్టించిన గాలివాన
- దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- రూ.1.40 కోట్ల మేర నష్టం
- ఆదుకోవాలని అన్నదాత వేడుకోలు



వేముల మండలం వేల్పులలో నేలకొరిగిన అరటి తోట

కడప అగ్రికల్చర్: నెలల తరబడి వేలకు వేలు ఖర్చు పెట్టి సాగు చేసిన పంటలు.. తీరా దిగుబడులు చేతికొచ్చే సమయంలో ఈదురు గాలులు, అకాల వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతో అన్నదాతలు నిండా మునిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కనీసం సాగు ఖర్చులు కూడా చేతికి రాకుండానే.. చివరకు అప్పులను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదే తరహాలో శుక్రవారం సాయంత్రం జిల్లాలో ఉన్నట్లుంటి వీచిన ఈదురుగాలులకు పలు మండలాల్లో అరటి, బొప్పాయి, కర్బూజ, నిమ్మ, మునగ వంటి పలు ఉద్యాన పంటలు నేలకొరిగాయి. దీంతో అన్నదాతలకు రూ.139.91 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు.

జిల్లాలో 464 మంది రైతులకు సంబంధించి..

ఒంటిమిట్ట, దువ్వూరు, చక్రాయపేట, వేంపల్లి, సింహాద్రిపురం, సిద్దవటం, ముద్దనూరు, లింగాల, వేముల మండలాల పరిధిలోని 464 మంది రైతులకు సంబంధించి 412.62 హెక్టార్లలో అరటి, బొప్పాయి, కర్బూజ, మిరప, నిమ్మ, మునగ వంటి వివిధ పంటల నేలకొరిగి దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.139.91 లక్షల మేర రైతులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నష్టపరిహారాన్ని అంచనా వేసినట్లు వారు తెలిపారు.

అత్యధికంగా దెబ్బతిన్న పంటలు

జిల్లాలోని కొన్ని మండలాల్లో అత్యధిక నష్టం జరిగింది. ఇందులో భాగంగా వేముల మండలం వేల్పుల గ్రామంలో అత్యధికంగా అరటి పంటలకు సంబంధించి 135 మంది రైతులకు చెందిన 120 హెక్టార్లలో పంట దెబ్బతిని రూ.42 లక్షల మేర నష్టం జరిగింది. అదే మండలం వేముల గ్రామంలో అరటికి సంబంధించి 55 మంది రైతులకు 46 హెక్టార్లలో పంట దెబ్బతిని 16.10 లక్షలు, మీడిపెంట్ల గ్రామంలో 55 మంది రైతులకు 45 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిని రూ.15.75 లక్షలు, అలాగే లింగాల మండలం వెలిదండ్లలో అరటి పంటకు సంబంధించి 55 మంది రైతులకు 48 హెక్టార్లలో పంట దెబ్బతిని 16.80 లక్షలు, చక్రాయపేట మండలం చక్రాయపేట గ్రామంలో 30 మంది రైతులకు సంబంధించి 16.8 హెక్టార్లలో నిమ్మపంట దెబ్బతిని రూ.5.88 లక్షలు, ఒంటిమిట్ట మండలం చింతమరాజుపల్లెలో అరటి, బొప్పాయి, కర్బూజ పంటలు 27 మంది రైతులకు సంబంధించి 32 హెక్టార్లలో పంట దెబ్బతిని రూ.9.60 లక్షల మేర నష్టం వాటిల్లింది.





సింహాద్రిపురం మండలంలో నేలకువాలిన మొక్కజొన్న పంట



సిద్దవటం మండలంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న అధికారులు



లింగాల మండలంలో విరిగి పడిన బొప్పాయి చెట్లు

దెబ్బతిన్న పంటల వివరాలు

మండలం	గ్రామం	పంట హెక్టార్లలో	విస్తీర్ణం	రైతులు	పంటనష్టం లక్షల్లో
ఒంటిమిట్ట	చింతరాజుపల్లి	అరటి	16	11	5.60
		బొప్పాయి	10	10	2.50
		కర్బూజ	6	5	1.50
		పచ్చిమిరప	6	9	2.10
దువ్వూరు	క్రిష్ణంపల్లి	బొప్పాయి	8	9	2,00
	కానగూడూరు	బొప్పాయి	6	7	1.50
	ఇడమడక	బొప్పాయి	8	9	2
చక్రాయపేట	చక్రాయపేట	నిమ్మపంట	16.8	30	5.88
వెంపల్లి	వెల్లిమవారిపల్లె	అరటి	4	6	1.40
సింహాద్రిపురం	అంకాలమ్మ గూడూరు	అరటి	10	5	3.50
	కొవరంగుంటపల్లె	అరటి	2	2	0.70
	బిదనంచెర్ల	అరటి	10	13	3.50
	కసనూరు	అరటి	0.82	1	0.29
సిద్దవటం	మాచుపల్లి	అరటి	2	2	0.70
ముద్దనూరు	గంగాదేవ్‌పల్లి	మునగ	1	1	0.25
లింగాల	వెలిదండ్ల	అరటి	48	55	16.80
		బొప్పాయి	6	5	1.50
	లింగాల	అరటి	20	15	7.00
	చిన్నకూడాల	అరటి	18	20	6.30
వేముల	వేముల	అరటి	46	55	16.10
	వేల్పుల	అరటి	120	135	42.00
	మీడిపెంట్ల	అరటి	45	55	15.75
	గొంతిపల్లి	అరటి	3	5	1.05
		మొత్తం	412.62	464	139.917

స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- కడపలో స్వచ్ఛతా ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డితో కలిసి కలెక్టర్ 'ఈ-చెక్' (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప నగరం ఏడురోడ్ల కూడలి నుంచి స్వచ్ఛత ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. వన్ టౌన్ సర్కిల్ వరకు సాగిన స్వచ్ఛతా ర్యాలీలో అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ దివస్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ శనివారాన్ని 'ఈ-చెక్' అంశంతో మనం వాడిన ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ ఈ మాసంలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్'(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పోగు చేసేందుకు కడప మున్సిపాలిటీలో ఒక అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేశామని, నగరంలోని నివాసాల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరణ కేంద్రంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజినీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య శిబిరం
కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో ఉపాధ్యాయులకు ఈ నెల 24 నుంచి 26 వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని గవర్నమెంట్, జిల్లా పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల అన్ని క్యాటగిరీల ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వైద్య ధ్రువీకరణ పత్రాలు అనగా ప్రిఫరెన్షియల్ క్యాటగిరి స్పెషల్ పాయింట్లకు అర్హత కలిగిన వారు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. హాస్పిటల్ వారు ఇచ్చిన సర్టిఫికెట్ మేరకు ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు రిమ్స్‌లో వైద్య ధ్రువీకరణ పత్రాలు పొందడానికి తాజా మెడికల్ రిపోర్టులు తీసుకుని రావాలని వివరించారు.

ఇరిగేషన్ ఏఈఈ, ఏఈల బదిలీ
కడప సెవెన్‌రోడ్స్: నీటి పారుదల శాఖలో పని చేస్తున్న భారీగా ఏఈఈ, ఏఈలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ శనివారం ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాయలసీమకు చెందిన జోన్-4లోని జిల్లాలకు చెందిన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ తదితర విభాగాల్లో పని చేస్తున్న ఇంజినీర్లను బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే పోస్టింగ్ ఇచ్చిన ప్రదేశానికి వెళ్లి రిపోర్టు చేసుకోవాలని ఈఎన్‌సీ ఆదేశించారు.

వక్ఫ్ సవరణ చట్టం.. రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ప్రతినిధి అబ్దుసుభాన్



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ప్రతినిధి అబ్దుసుభాన్
- భారీగా ముస్లింల శాంతి ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు ప్రతినిధి కేఎం అబ్దుసుభాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ముబారక్‌షాదీ మంజిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ముస్లింలు భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టసవరణను ముస్లిం సమాజం, ముస్లిం పర్సనల్ లాబోర్డు పూర్తిగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఇది ముస్లిం సమాజాన్ని ఇబ్బంది పెట్టే విధంగా ఉందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26కు విరుద్ధంగా ఉందని, ఇస్లాం సంప్రదాయాలు, మత స్వేచ్ఛ, సాంస్కృతిక హక్కులు, మత సామరస్యం, సామాజిక ఐక్యతను ప్రభావితం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు.. ఈ సవరణ చట్టానికి వత్తాసు పలకడం ముస్లిం సమాజాన్ని కలచివేసిందన్నారు. 400 ఏళ్ల నాటి స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దీనివల్ల పురాతన మసీదులు, దర్గాలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాడతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజల మధ్య అశాంతిని సృష్టిస్తున్నాయన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వక్ఫ్ సరవణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్‌ఖాజా, జేఏసీ కన్వీనర్ అబ్దుసమద్, కో కన్వీనర్ సలీం, సభ్యులు రహమతుల్లా, హిదాయతుల్లా, సీపీఐ ఏరియా సమితి కార్యదర్శి సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, సీఎంఎస్ నాయకురాలు పద్మ, పలు మసీద్‌ల ఇమాంలు, ధార్మిక పండితులు, ముస్లిం పెద్దలు, ప్రజాస్వామ్యవాదులు, ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మేకలబాలాయపల్లె గ్రామానికి చెందిన ఓ యువతి (19) అదృశ్యమైనట్లు కలమల్ల ఏఎస్ఐ రమణయ్య తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆ తర్వాత తిరిగి రాలేదు. దీంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల దాడిలో గాయపడిన వ్యక్తికి తీవ్ర అస్వస్థత


రిమ్స్‌లో బాధితుడు రామ ఓబుళరెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి ఎస్ఐ దాడి చేయడంతో నాగాయపల్లె గ్రామానికి చెందిన రామఓబుళరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. లాఠీ దెబ్బలు తిని గాయపడిన రామ ఓబుళరెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రే తీయగా పక్కటెముకలు వాపు వచ్చి దెబ్బతిన్నట్లు బాధితుడు తెలిపారు. రిమ్స్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేసిన కేసులో రాజీ ప్రయత్నాల కోసం ఎస్ఐ టీడీపీ మండల నాయకులను ఆశ్రయించాడు. టీడీపీ నాయకులు రంగంలోకి దిగి చెన్నూరులో రామఓబుళరెడ్డి బంధువు ఇంటికి వెళ్లి రాజీ ప్రయత్నాల కోసం మంతనాలు సాగించినట్లు విశ్వసనీయ సమాచారం.

విద్యార్థిని చితకబాదిన కరస్పాండెంట్


బాధిత విద్యార్థి హర్షవర్ధన్

పోరుమామిళ్ల : స్థానిక హోలీ రోసరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ ఫ్యాన్ విరగ్గొట్టాడని కరస్పాండెంట్, ఉపాధ్యాయుడు చితకబాదినట్లు శనివారం సమాచారం వైరల్ అయింది. ఫ్యాన్ విరిగితే ఆ ఖర్చు తల్లిదండ్రులతో మాట్లాడి రాబట్టుకోవాలని, అది చేయకుండా విద్యార్థిని చితకబాదడం సబబా? అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై తల్లిదండ్రులతో ఆర్‌సీఎం నిర్వాహకులు మాట్లాడుతున్నట్లు సమాచారం.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం




కడప అర్బన్ : కడప నగరంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (50)ని ఈనెల 16న కడప జీజీహెచ్(రిమ్స్)లో చేర్పించారు. 19వ తేదీన తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలు తెలిసినవారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ టీచర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ నారాయణ స్కూల్ సమీపంలో నివాసం ఉన్న రంగారెడ్డి భార్య ఆర్.హేమలత (56) కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె వద్ద ఉన్న ఓ పాఠశాలలో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నారు. శనివారం విధులకు హాజరయ్యేందుకు వెళ్లి నందిరెడ్డిగారిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

ఉన్నత చదువుకు తొలిమెట్టు

- ఏపీఈఏపీ సెట్ దరఖాస్తుకు ఈ నెల 24 వరకు గడువు
- ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్ష
- మే 19, 20వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- మే 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ పరీక్ష
- దరఖాస్తు సమయంలో జాగ్రత్తలు తప్పని సరి



కడప ఎడ్యుకేషన్ : ఇంటర్ ఫలితాలు వచ్చేశాయి. ఇక విద్యార్థులు డిగ్రీనా, ఇంజినీరింగ్‌నా అనేది తేల్చుకునే సమయం కూడా ఆసన్నమైంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్ -2025 ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. అవి కూడా ఈ నెల 24వ తేదీకి ముగియనున్నాయి. ఇంకా దరఖాస్తు చేసుకోని విద్యార్థులెవరైనా ఉంటే త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా జిల్లాతోపాటు రాష్ట్రంలో ఎక్కడైనా ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. సీనియర్ ఇంటర్ ముగిసిన ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులు cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అయి ఏపీ ఈఏపీసెట్-2025ను ఎంపిక చేసుకోవాలి. ఏపీఈఏపీసెట్ సైట్‌లో పరీక్ష రాసేందుకు అర్హతలు, దరఖాస్తు ప్రక్రియతోపాటు కోర్సుల వివరాలు, ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించిన తేదీలు, సూచనలు తదితర పూర్తి వివరాలు పొందవచ్చు.

దరఖాస్తుకు ధ్రువపత్రాల వివరాలు తప్పని సరి..

ఏపీ ఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో వివిధ కేటగిరీల పరిధిలోకి వచ్చే విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలు తప్పని సరిగా సిద్ధం చేసుకోవాలి. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, పీహెచ్‌సీ కేటగిరిల వారిగా తమ సామాజిక వర్గాన్ని ఎంపిక చేసుకుని ఆన్‌లైన్ అప్లికేషన్‌లో క్లిక్ చేయాలి. అదే విధంగా ధ్రువపత్రాలకు సంబంధించిన నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువపత్రాలు నంబర్‌ను సైతం విధిగా నమోదు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ తరువాత తీసుకున్న ధ్రుపత్రాలను పరిగణనలోకి తీసుకున్నారు.

స్థానికత నిర్ధారణకు...

విద్యార్థులు స్థానికత నిర్ధారణకు 6వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏ విద్యా సంస్థల్లో చదివాడు, ఏ ఊరిలో చదివాడనే వివరాలు ఆయా విద్యా సంవత్సరాల వారిగా నమోదు చేయాలి. చివరలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ఏ జిల్లాలో రాస్తారనే సమాచారంతో కూడిన ట్యాబ్‌లను ప్రాధాన్యత క్రమంలో క్లిక్ చేయాలి. ఈ విధంగా ఐదు ప్రాధాన్యతలను క్లిక్ చేయాల్సి ఉంటుంది. సొంత జిల్లాకు చెందిన విద్యార్థి తమ సొంత జిల్లాలో పరీక్ష రాసేందుకు ఆప్షన్ ఎంచుకున్నప్పటికీ అక్కడి పరీక్షా కేంద్రంలో పరిమితి మించిపోవడం, ఇతర కారణాలతో పరీక్షా కేంద్రం అందుబాటులో లేని పక్షంలో తరువాత వరుస క్రమంలో ఇచ్చిన ప్రాధాన్యతల వారిగా ఆయా జిల్లాలో పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత..

ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి సబ్‌మిట్ చేసిన తరువాత ప్రింటవుట్ తీసుకోవాలి. పరీక్ష జరిగే రోజున ఏపీ ఈఏపీ సెట్ హాల్‌టికెట్‌తోపాటు ఆన్‌లైన్ ప్రింటవుట్ కాపీపై ఫొటో అంటించి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్‌కు అందజేయాలి.

ఫీజు చెల్లించే సమయంలో ఇచ్చిన రెఫరెన్స్ ఐడీ, విద్యార్థి పేరు, సీనియర్ ఇంటర్ హాల్‌టికెట్, పుట్టిన తేదీ వివరాలతో భవిష్యత్తులో ఈఏపీ సెట్ హాల్ టికెట్, పరీక్షకు హాజరయ్యే సమయంలో సంబంధిత వివరాలు కీలకంగా మారుతాయి. కనుక జాగ్రత్తగా ఉంచుకోవాలి.

దరఖాస్తు ప్రక్రియ ఇలా...

ఏపీఈఏపీసెట్-2025 సైట్‌కు లాగిన్ అయిన తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఐదు దశల్లోని ప్రక్రియను పూర్తి చేయాలి.

స్టెప్-1..

ఎలిజిబులిటీ క్రైటీరియా అండ్ ఫీజు పేమెంట్‌కు లాగిన్ అయి సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. విద్యార్థి పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, ప్రత్యామ్నాయ మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ నమోదు చేయాలి. దీంతోపాటు ఇంజినీరింగ్ ఫార్మా, అగ్రికల్చర్ ఫార్మసీ, బోత్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీల వారిగా తాము రాయబోయే ప్రవేశ పరీక్ష, చేరనున్న కోర్సుల వారిగా మూడు ఆప్షన్లలో ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. తరువాత సామాజిక వర్గాల వారిగా కేటగిరిపై క్లిక్ చేసి ఆన్‌లైన్ ఫీజు పేమెంట్ చేయాలి. క్రెడిట్, డెబిట్‌కార్డు, నెట్ బ్యాకింగ్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

స్టెప్-2..

నో యువర్ పేమెంట్ స్టేటస్‌పై క్లిక్ చేసి సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నెంబర్, మొబైల్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలు పూర్తి చేయాలి. తదుపరి చేరనున్న కోర్సుల వారిగా ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్‌లలో ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

స్టెప్-3..

ఫిల్ అప్లికేషన్‌లో పేమెంట్ చేసిన ఐడీతోపాటు సీనియర్ ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్, పుట్టినతేదీ వివరాలు నమోదు చేయాలి. అనంతరం ప్రొసీడ్ టు ఫిల్ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి.

స్టెప్-4..

ఇక్కడ నో యువర్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేసి పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సందర్శించవచ్చు.

స్టెప్-5..

ఇక్కడ్ క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి.

వడ దెబ్బతో ఉపాధి కూలీలు మృతి


ఓబుళరెడ్డి (ఫైల్)

సింహాద్రిపురం : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం వడదెబ్బతో ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందారు. సింహాద్రిపురం మండలం నంద్యాలమ్మ బావి న్యూ ఫీడర్ ఛానల్ కాలువ పనులరే వెళ్లిన ఓబుళరెడ్డి దాహం వేయటంతో నీరు తాగి కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఈ విషయాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ భవాని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉపాధి కూలీ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏపీఓ జయభారతి, ఈసీ శ్రీనివాసులరెడ్డి, టీఏలు రజిత, లక్షుమయ్యలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.


పోలయ్య (ఫైల్)

అట్లూరు : మండల పరిధిలోని మణ్యం వారిపల్లె పంచాయతీ పార్వతీపురంలో చాట్ల పోలయ్య (43) అనే ఉపాధి కూలీ శనివారం ఉదయం సమీపంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. అక్కడ తోటి కూలీలతో పనులు చేస్తూ మండే ఎండలకు తాళలేక ఉన్నపళంగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు, స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యమ్మ, కుమారుడు సంపత్, కుమార్తె శృతి ఉన్నారు.

అక్రమంగా కొండను తవ్వేస్తున్నారు


ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పశువుల మేత కోసం వదిలిన కొండ ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకుని పూర్తిగా చదును చేస్తున్నారని , పైగా ఎలాంటి అనుమతులు లేకుండా సోలార్ కంపెనీ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆర్డీఓ ఆదిమూలపు సాయిశ్రీకి ఫిర్యాదు చేశారు. శనివారం పెద్దముడియం మండలంలోని కొండ పాపాయపల్లి, దిగువకల్వటాల గ్రామాలకు చెందిన రైతులతో కలిసి ఆర్డీఓను కలిశారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కొండపాపాయపల్లి పంచాయతీ పరిధిలో నాగరెడ్డిపల్లె గ్రామంలోని సర్వే నంబర్ 224లో నంద్యాల, కడప జిల్లా ప్రాంతాలకు చెందిన రైతులు పశువులను మేపుకునేందుకు వస్తుంటారని తెలిపారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతంలో పూర్తిగా పంటలు వేసుకుంటారన్నారు. పశువుల మేత కోసం అన్ని వర్గాల ప్రజలకు ఈ కొండనే ఆధారంగా నిలిచిందని చెప్పారు. అలాంటి కొండను సోలార్ కంపెనీ కోసం పూర్తిగా చదును చేస్తున్నారన్నారు. కల్వటాల గ్రామానికి చెందిన రైతుల పట్టా భూముల్లో రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా పనులు చేసి వదిలేశారన్నారు. వారు వేసిన సిమెంట్ దిమ్మెలను తొలగించాలంటే రైతులకు లక్షల రూపాయలలో ఖర్చు అవుతుందన్నారు. వారికి న్యాయం జరిగే విధంగా అధికారులు సోలార్ కంపెనీ ద్వారా హామీ ఇప్పించాలని కోరారు. అధికారులు ఒకవైపు అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. అక్కడ పనులు మాత్రం వేగంగా జరుగుతున్నాయన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కొండపాపాయపల్లె నాయకుడు వెంకటసుబ్బారెడ్డి, కల్వటాల నాయకుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోగస్ పట్టా అని తేలితే జైలుకు వెళ్లేందుకు సిద్ధం

- బోర్డు తొలగించకుంటే మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు
- సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణరెడ్డి



కడప రూరల్ : కడప భగత్‌సింగ్‌నగర్ సర్వే నంబరు 344లో తన భార్య పేరిట ఉన్న 2.50 సెంట్ల స్థలం నకిలీ పట్టా అని తేలితే తాను జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమేనని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడప ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ స్థలం తన భార్య పేరిట ఎలా వచ్చిందో విచారించి చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడటాన్ని ఆయన తప్పుబట్టారు. భగత్‌సింగ్ నగర్ భూపోరాటం జరిగిన 1996, 1998 సంవత్సరాలలో వీరెవరూ ఆ పార్టీలో లేరని తెలిపారు. భగత్‌సింగ్ నగర్ స్థలం తన భార్య పేరిట పట్టా ఉందంటూ 2016 డిసెంబరు 31న కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదులో స్పష్టం చేసిన సీపీఎం నాయకులకు ఇప్పుడది నకిలీ పట్టాగా ఎలా కనబడుతోందో వివరించాలన్నారు. డీకేటీ పట్టాపై తహసీల్దార్ వద్ద విచారణ జరుగుతోందన్నారు. సంబంధం లేని స్థలంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పాతిన బోర్డును తక్షణమే తొలగించాలన్నారు. లేకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయించడం ద్వారా ఆయనపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. 2014 తర్వాత సీపీఎం రాష్ట్ర నాయకత్వం అవలంబిస్తున్న విధానాలతో తాను విబేధించి బయటకు వచ్చానని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కండక్టర్‌కు కలాం కార్మిక రత్న అవార్డు

రాజంపేట : ఏపీఎస్ఆర్టీసీ కండక్టర్ సీఎస్ మణ్యం కలాం కార్మికరత్న అవార్డును దక్కించుకున్నారు. ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా తమిళనాడులోని మధురైలో జేపీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అయ్యప్పన్, శ్రీలంక ప్రభుత్వ యువజన సర్వీసుల కమిషనర్ తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు కండక్టర్ తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి

సుండుపల్లె : మండలంలోని అగ్రహారంలో నివాసం ఉంటున్న గూటి శివకుమార్(36) అనే హోం గార్డు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య నవ్యసుధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రాజంపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో శివకుమార్ హోంగార్డు(498)గా విధులు నిర్వహించే వాడు. అనారోగ్యం కారణంగా గత కొద్ది రోజుల నుంచి సెలవులో ఉన్నాడు. హోంగార్డు శివకుమార్ మృతిపట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అమరనాథరెడ్డి, రాజంపేట సబ్ డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జి లక్ష్మీరెడ్డి, పోలీసు సిబ్బంది, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ కోడూరువాండ్లపల్లి గ్రామంలో స్వగృహంలో ఉన్న హోంగార్డు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బేకరీని తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

రామసముద్రం : రామసముద్రంలోని ఓ బేకరీని శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటన తెలిసిందే. ఈ మేరకు అన్నమయ్య జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీం బాషా తన సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. బేకరీలోని పలు రకాల తినుబండారాలను పరిశీలించారు. పదార్థాల తయారీకి సంబంధించి పరికరాలు, వస్తువుల నాణ్యతను తెలుసుకున్నారు. ఇందులో కొన్ని పదార్థాలను ల్యాబ్ పరిశీలన నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులు తీసుకెళ్లారు.

మహిళపై దాడి

మదనపల్లె : స్థలం వివాదం కారణంగా మహిళపై ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా దాడి చేసిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ కత్తోళ్ల ఊరు గ్రామానికి చెందిన గుర్రప్ప భార్య గోపమ్మ(45), తమ స్థలంలో పక్కింటి వారు రాళ్లు వేయడంతో వాటిని తీసివేయాల్సిందిగా కోరింది. అయితే ఈ విషయమై వివాదం చెలరేగి గోపమ్మపై అదే గ్రామానికి చెందిన కదిరప్ప, సరసమ్మ, భాస్కర కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో గోపమ్మ తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదు


రమేష్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఎస్. శివరామ్

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ అన్నారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి బీసీ విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లా నుంచి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరామ్‌తోపాటు పలువురు బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ విభాగాన్ని ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలి, పార్టీని ఎలా పటిష్టం చేయాలనే అంశాలపై బీసీ నేతలు దిశానిర్దేశం చేశారని, తదనుగుణంగా రాబోయే రోజుల్లో జిల్లా బీసీ విభాగం పనిచేస్తుందని తెలిపారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు పూర్తి చేసి, కూటమి ప్రభుత్వంలో బీసీలకు జరిగే అన్యాయాలు, టీడీపీ వారు చేసే అక్రమాలను బయటపెడతామన్నారు.

చెట్టును ఢీకొన్న మారుతీ వ్యాన్

- ఒక వ్యక్తి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం

మదనపల్లె/చిన్నమండెం : వేగంగా వస్తున్న మారుతి వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం మదనపల్లె మండలంలో ఈ సంఘటన జరిగింది. లక్కిరెడ్డిపల్లె మండలం, చింతకుంటవారిపల్లెకు చెందిన అల్లా బక్షు, జరీనా దంపతుల కుమారుడు ఆరీఫుల్లా (42) అప్పకొండయ్యగారిపల్లె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేసేవాడు. ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో చేరాడు. చిన్నమండెం మండలం మల్లూరులో ప్రస్తుతం ఉంటున్నాడు. చిన్న మండెంలో డొడ్ల మిల్క్ డైరీ షాప్ నిర్వహిస్తున్న మోదిన్ సాబ్ కుమారుడు ముజాహిద్దీన్ (35)తో కలసి మారుతి ఓమ్ని వ్యాన్‌లో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు చిన్నమండెం వెళ్లేందుకు అదే వాహనంలో వాయల్పాడు, గుర్రంకొండ మీదుగా బయలుదేరారు. మార్గమధ్యంలోని మదనపల్లె - తిరుపతి రహదారిలో సీటీఎం గంగమ్మ గుడి ఆలయ సమీపంలో, ఆరీఫుల్లా వాహనాన్ని డ్రైవింగ్ చేస్తూ అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆరీఫుల్లా తీవ్రంగా గాయపడి డ్రైవింగ్ సీట్ లోనే మృతి చెందాడు. పక్కనే ఉన్న ముజాహిద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు గంట సేపటి వరకు 108 వాహనం సంఘటన స్థలానికి రాకపోవడంతో క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యమైంది. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకున్న బాధితుడు ముజాహిద్దీన్‌కు అత్యవసర చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకువెళ్లారు. ప్రమాద సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దుర్మరణం చెందిన ఆరిఫుల్లా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతునికి భార్య ఆస్మా ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.